# అధికారులు అభివృద్ధికి తోడ్పడాలి

**రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

కొత్తగూడ, నవంబర్ 29: అధికారులు త మ పనితీరుతో మండల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లాలోని అభివృద్ధి సంక్షేమ పథకాలు, ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలపై సంబంధిత అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రెండు మండలాల్లోని గ్రామాల్లో ప్రత్యేకాధికారుల ద్వారా సమీక్షలు నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా టార్గెట్‌లను నిర్దేశించుకొని పని చేయాలన్నారు. ఐటీడీఏ నిధుల ద్వారా లైబ్రరీ, కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవాలని, మండల కేంద్రంలో పెద్ద హాల్, రూ.50లక్షలతో ఒక ఫంక్షన్ హాల్ నిర్మించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు ప్రతి రోజూ తనిఖీ చేయాలని, పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఇరిగేషన్ అధికారులు చెక్‌డ్యాంలు, చెరువుల పనుల ఎస్టిమేషన్లు ఇవ్వాలన్నారు. అధికారులు జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, వైద్యశాఖలో రెండు మండలాలకు సంబంధించి ఖాళీల వివరాలను తెలుపాలన్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామాల్లో పర్యటించి వైద్యసేవలు అందించాలన్నారు. పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో మధుసూదనరాజు, డీపీవో హరిప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ అజయ్‌కుమార్, ఈఈ విద్యాసాగర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ నరేశ్, గంగారం ఎంపీడీవో అప్పారావు, డీహెచ్ఎస్‌వో మరియన్న, కొత్తగూడ తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు. అనంతరం కొత్తగూడ, రైతువేదికలో మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు, రాయితీ, గెలల ధరల వివరాల కరపత్రాలను ఆవిష్కరించారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్**

వంట నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం/మహబూబాబాద్ రూరల్, నవంబర్ 29: వసతి గృహాల్లోని విద్యార్థులకు రుచికరమైన భోజనం, మెరుగైన విద్య అందించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ నిర్వాహకులు, ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మోడల్ స్కూల్‌ను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటశాలలో సరుకులు, కూరగాయలను చూసి అవాక్కయ్యారు. డీఈవోకు ఫోన్ చేసి మోడల్ స్కూల్ పరిస్థితిని వివరించారు. 20 మంది విద్యార్థుల కోసం కిలో ఆలుగడ్డ, 100గ్రాముల నూనె ఉపయోగించడం ఏమిటని డీఈవోను ప్రశ్నించారు. మరోసారి ఇలాంటివి పునరావృతమైతే సహించేది లేదన్నారు. అనంతరం విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి పాల్గొనారు. అదేవిధంగా అన్నారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. చెత్త, తేమశాతం తక్కువగా ఉన్న ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే మహబూబాబాద్ మండలంలోని గాంధీపురం, అనంతారంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 29: రాష్ట్రవ్యాప్తంగా నేడు ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రతి రోజూ ఏదో ఒక చోట ఫుడ్ పాయిజన్ అవుతున్నదని, అయినా విద్యార్థుల క్షేమంపై ప్రభుత్వం ఆలోచన చేయడం లేదన్నారు. నిరంతరం పాఠశాలలు, హాస్టల్స్, కళాశాలలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ సంఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో గుగులోత్ సూర్య, సింహాద్రి, మహేశ్, వినోద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం : ఎమ్మెల్యే

లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

తొర్రూరు, నవంబర్29: నిరుపేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాయపర్తి, పెద్దవంగర, తొర్రూరు మండలాలకు చెందిన 163 మంది లబ్ధిదారులకు రూ.56.43 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా ప్రజలు తమ దృష్టి కి తీసుకురావాలన్నారు. ప్రజలందరికీ సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్‌చైర్మన్ సురేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

I, **OSMAN(old name) s/o SHAIK MASTAN** H.NO:-1-7-377, REVENUE COLONY HANAMKONDA, TELANGANA, have changed my name as **SHAIK USMAN MIYA (New Name)** and henceforth I will be called as **SHAIK USMAN MIYA** for all the future purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# ఘనంగా దీక్షా దివస్

- జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి తరలిన పార్టీ శ్రేణులు
- మండల కేంద్రాల్లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం
- అమరులు, తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళి

మహబూబాబాద్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి కోటేశ్వర్‌రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, ఉద్యమకారులు

శ్రీహరికి పార్టీ కండువా కప్పుతున్న కవిత, శంకర్‌నాయక్

మహబూబాబాద్ రూరల్/ గూడూరు/గార్ల/ నవంబర్ 29: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిరాహార దీక్ష చేపట్టి 15 ఏండ్లు పూర్తయిన సందర్భంగా మహబూబాబాద్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షాదివస్ కార్యక్రమానికి జిల్లాలోని మండలాల నుంచి మండలం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం తరలివెళ్లారు. మానుకోటలో మాజీ ఎంపీ మాలోత్ కవిత అధ్యక్షతన దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులతో కలిసి మానుకోటలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తెలంగాణ ఉద్యమ కారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' నినాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సారథ్యంలోనే సాధించారని పేర్కొన్నారు. తరలివెళ్లిన వారిలో పార్టీ రాష్ట్ర నాయకుడు బీరవెళ్లి భరత్‌కుమార్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం సంపత్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్, నాయకులు వాంకుడోత్ కఠార్‌సింగ్, రహీం, బొంత రాములు, వెంకన్న, సంపంగి రాములు, సురేశ్, పాపయ్య ఉన్నారు. గార్లలోని అమరవీరుల స్తూపం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలో జరిగే దీక్షాదివస్ కార్యక్రమానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేశ్, పానుగంటి రాధాకృష్ణ, గాజుల గణేశ్, శ్రీనివాస రావు, ఉమేశ్, సక్రు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో శ్రీహరి చేరికలు**

గూడూరు: కాంగ్రెస్ పార్టీ నాయకుడు తండా శ్రీహరి శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. దీక్షా దివస్ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయడంలేదని, అందుకే పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సురేందర్, చీదురు వెంకన్న, కఠార్‌సింగ్, రహీం, రాములు, రమేశ్, సురేశ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నం కోసమే..**

కొత్తగూడ: తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నం కోసమే దీక్షా దివస్ అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణుయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో దీక్షా దివస్‌లో భాగంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం మాట్లాడారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తెలంగాణ సాధించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి బానోత్ నెహ్రూనాయక్, గంగారం మండల అధ్యక్షుడు ఇర్ప సూరయ్య, మాజీ ఎంపీటీసీ నానుబోతుల స్వప్నా లింగన్న, మోకాళ్ల సంతోషరాణి, వెంకటేశ్, మాజీ సర్పంచ్ బానోత్ కిషన్, బానోత్ వీరన్న, గొగ్గల లక్ష్మయ్య, పార్టీ సీనియర్ నాయకులు బొల్లు రవి, చెనూరి వెంకన్న, బాల కొమురయ్య, వెంకటనారాయణచారి, కొమ్మనబోయిన మల్లయ్య, ఆవుల రమేశ్, పడాల నాగేశ్వర్‌రావు, ఇర్ప సాంబయ్య, చెనూరి దేవేందర్, తాళ రవి, జనగాం రవి, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మహబూబాబాద్‌కు తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గార్ల: అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

కొత్తగూడ: కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలి

బయ్యారం, నవంబర్ 29: ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని మహబూబాబాద్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ తిరుపతిరావు అన్నారు. శుక్రవారం రాత్రి బయ్యారం పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి పోలీసుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులతో మర్యాదగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, నిషేధిత వస్తువుల అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే పోలీస్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి, సిబ్బంది అనిల్, సతీశ్, రమేశ్ ఉనారు.

# హామీలు అమలు చేయాలి

కురవి, నవంబర్ 29: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా కార్యదర్శి రడం గౌరమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో టైపిస్ట్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌరమ్మ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని, లేకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# విద్యార్థులకు గణిత ప్రతిభా పోటీలు

గూడూరు: గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం సుజాత

కురవి/ దోర్నకల్/ ఇనుగుర్తి/ కేసముద్రం/ పెద్దవంగర/ మహబూబాబాద్ రూరల్, నవంబర్ 29: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా తెలంగాణ గణిత ఫోరం మండలశాఖ అధ్యక్షుడు వెంపటి సీతారాములు అధ్యక్షతన గురువారం ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు మండలస్థాయి గణిత ప్రతిభా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో వీ బాలాజీ పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచ్చారు. పరీక్షలను హెచ్ఎం వాహిద్, జిల్లా టీఎంఎఫ్ అధ్యక్షుడు మాధవాచారి పర్యవేక్షించారు. అదేవిధంగా దోర్నకల్ జడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం బండి నరసింహారావు అధ్యక్షతన మండల స్థాయి టాలెంట్ టెస్టు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచ్చారు. వారికి హెచ్ఎం సొంత ఖర్చుతో బహుమతులు అందజేశారు. ఇనుగుర్తిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఇన్‌చార్జి అమ్మ యాకయ్య, మండల గణిత ఫోరం అధ్యక్షుడు సమ్మిరెడ్డి, కార్యదర్శి నరేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. కల్వల ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం బండారు నరేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని సూచించారు. గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గణిత పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గార్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఫోరం ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విజేతలకు షీల్డ్స్ అందజేశారు. ఎంఈవో వీరభద్ర రావు, గణిత ఫోరం అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, హెచ్ఎం రామచంద్రు, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పెద్దవంగరలో మండలస్థాయి గణిత ప్రతిభ పోటీలను తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు అవుతాపురం పాఠశాల హెచ్ఎం పీ కళాధర్ తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించినట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మండలస్థాయి గణిత పోటీలు నిర్వహించారు. సకల శాస్త్రాలకు మూలాధారం గణితమని, ప్రతి ఒక్కరూ గణిత అంశాలపైన ప్రత్యేక పట్టు సాధించేవిధంగా సాధన చేయాలని ఎంఈవో వెంకటేశ్వరరావు సూచించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం కోట్యా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నెల్లికుదురులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గణత ప్రతిభా పోటీలను కాంప్లెక్స్ హెచ్ఎం జీవన్‌కుమార్, తెలంగాణ గణిత ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు మచ్చ సోమయ్య ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. దంతాలపల్లి లోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ప్రతిభా పోటీలను తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు.

# హార్వెస్టర్ ప్రమాదంలో డ్రైవర్ మృతి

మరిపెడ, నవంబర్ 29: హార్వెస్టర్ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని గుండెపుడిలో గురువారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాములు తన వరి పొలాన్ని మిషన్‌తో కోయిస్తున్నాడు. ఉదయం నుంచి హార్వెస్టర్‌ను నడిపిన సత్తిరాజు సాయంత్రం మరో డ్రైవర్‌కు అప్పగించి పొలం పక్కన సేదతీరాడు. ఈ క్రమంలో అతడు హార్వెస్టర్‌తో పొలం కోసుకుంటూ వెళ్లి నిద్రిస్తున్న సత్తిరాజు పై నుంచి తీసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం రాజు కోసం ఎక్కడా వెతికినా కనిపించలేదు. ఉదయం రైతు పొలం వద్దకు వెళ్లి చూడగా రాజు మృతదేహం కనిపించగా వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించారు. మరిపెడ ఎస్సై సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. మృతుడు తమిళనాడు రాష్ట్రం మధురై జిల్లాకు చెందిన వాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహన్ని పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్రానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# సాయిప్రియాంకకు డాక్టరేట్

అవార్డు అందుకుంటున్న సాయిప్రియాంక

గార్ల, నవంబర్ 29: గార్లలోని బెస్తబజారుకు చెందిన పగడాల సాయి ప్రియాంక కొండ ప్రాంతంలో వ్యవసాయం చేసే విధానంపై చేసిన పరిశోధనలకు నాగాలాండ్ గవర్నర్ ఎల్ఏ గణేశన్ శుక్రవారం డాక్టరేట్, అవార్డు అందజేశారు. డిసెంబర్ 2 నుంచి 5 వరకు శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగే న్యూట్రిన్ సదస్సుకు భారతదేశం తరపున సాయిప్రియాంక ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. సాయి ప్రియాంక తండ్రి నరసింహారావు ఉపాధ్యాయుడు కాగా, తల్లి స్టాఫ్ నర్స్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, విద్యావేత్తలు, బంధువులు అభినందించారు.

# వీరభద్రస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన



లక్షబిల్వాలతో స్వామివారు

కురవి, నవంబర్ 29: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక బహుళ త్రయోదశి సందర్భంగా శివలింగ రూపుడైన వీరభద్రస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన పొన్నాల సందీప్-వింధ్యారాణి, కొంతం నర్సింగ్‌రావు-జ్యోతి, సుభాశ్, ఉమారాణి దంపతులు వేదపండితులు బాలకృష్ణ, శ్రీకాంత్, పూజారులు రెడ్యాల శ్రీనివాస్, అనిల్, విజయ్, పుణ్యమూర్తి, తేజ, రమేశ్, విజయ్, అభిలాశ్ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మంటపారాధన, మహన్యాస పారాయణం, ఏకాదశ రుద్రాభిషేకాలు, పూర్ణాభిషేకం, చండీ, రుద్రహోమం నిర్వహించారు. సాయంత్రం లక్ష బిల్వార్చనతో స్వామిని అలంకరించారు. అనంతరం మహానివేదన, తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తుల సహకారంతో పార్వతి రామలింగేశ్వర, నవగ్రహ, జంట నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. కురవికి చెందిన దాతల సహకారంతో విగ్రహాలను ఏర్పాటుచేశారు. తాటిపాముల నర్సింహమూర్తి, గుడి రాధాకృష్ణమూర్తి, బుక్క వీరన్న, పెనుగొండ మధుశర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. అర్చకులు, భక్తులు, దాతలు పాల్గొన్నారు. సాయంత్రం పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతులు మహా అన్నప్రసాదాన్ని భక్తులకు అందించారు. మొక్కులు చెల్లించుకున్నారు.

# గీత కార్మికుల ఉపాధిని మెరుగుపర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ

కురవి(సీరోలు), నవంబర్ 29: రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని, వారి ఉపాధి మెరుగుపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ అన్నారు. సీరోలు మండలంలోని చింతపల్లిలో శుక్రవారం సంఘం 67వ వార్షికోత్సవం సందర్భంగా 'తెలంగాణలో 10 ఏళ్ల ప్రయాణం.. కల్లుగీత వృత్తిలో ఉపాధి' అంశంపై యమగాని వెంకన్న అధ్యక్షతన నిర్వహించి జిల్లా సదస్సులో రమణ మాట్లాడారు. కల్లుగీవృత్తిలో ఉపాధి మెరుగుపడాలంటే ప్రధానంగా చెట్ల పెంపకానికి భూమి ఇవ్వాలని, కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం సుప్రజ దవాఖాన ఎండీ శిగ విజయ్‌కుమార్‌గౌడ్, కిసాన్ పనివార్ సీఈవో వివేక్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గౌని వెంకన్న, సాదుల శ్రీనివాస్, గునిగంటి రాజన్న, గునిగంటి మోహన్, కొంపెల్లి వెంకటేశ్, సీహెచ్ శ్రీనివాస్, వెంకన్న, బాలగని నవీన్ పాల్గొన్నారు.

# 'రాష్ట్రస్థాయి రగ్బీ'కి రాజోలు విద్యార్థులు

లోకేశ్‌నాయక్ రోహిత అనిల్

కురవి, నవంబర్ 29: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు మండలంలోని రాజోలు పాఠశాల విద్యార్థులు మాలోత్ లోకేశ్‌నాయక్, ధరావత్ రోహిత, గుండ్రాతిమడుగు(విలేజ్) పాఠశాలకు చెందిన ఏ అనిల్ ఎంపికైనట్లు పాఠశాలల హెచ్ఎంలు ఆళ్ల రవికుమార్, కే జానయ్య శుక్రవారం తెలిపారు. వీరు ఈ నెల 30 నుంచి డిసెంబర్ 2 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే 68వ స్కూల్‌గేమ్స్ అండర్-14 విభాగంలో పాల్గొంటారన్నారు. విద్యార్థుల ఉన్నతికి కారణమైన వ్యాయామ ఉపాధ్యాయులు పీ కాశీనాథ్, కమల్ కిశోర్, విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

# 'రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్'కు పెద్దవంగర విద్యార్థులు



లోకేశ్, ఆర్ రవికిరణ్

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

పెద్దవంగర, నవంబర్ 29: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పెద్దవంగర ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీరాం కార్తీక్, నానబాల అర్జిత్ అండర్-12సబ్‌జూనియర్ విభాగంలో ఎంపికైనట్లు ఎంఈవో బీ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మంచిర్యాలలో డిసెంబర్ 1, 2 తేదీల్లో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే చిట్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్ లోకేశ్, ఆర్ రవికిరణ్ జిల్లాస్థాయి జేవీవీ టాలెంట్ టెస్ట్ క్విజ్ పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 29: నేడు పట్టణంలోని అనంతారం ఆదర్శ పాఠశాలలో నిర్వహించనున్న జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థులను సకాలంలో తీసుకురావాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వైజ్ఞానిక ప్రదర్శనపై హెచ్ఎంలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజులపాటు జరిగే సైన్స్‌ఫెయిర్‌కు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సైన్స్ అధికారి అప్పారావు, మందుల శ్రీరాములు, విజయకుమారి, బుచ్చయ్య, లచ్చిరాం, బాలాజీనాయక్, వెంకన్న పాల్గొన్నారు.

# ఎంపీడీవోల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 29: తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం (ఎంపీడీవోలు) జిల్లా నూతన కమిటీని ఎన్నుకునారు. శుక్రవారం పట్టణంలో జడ్పీ డిప్యూటీ సీఈవో నర్మద ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా బీ వేణుమాధవ్, జనరల్ సెక్రటరీగా వీరబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా విజయ, ట్రెజరర్‌గా బాలరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా క్రాంతి, ఈసీ మెంబర్లుగా విక్రమ్, రామారావును ఎన్నుకున్నారు. కార్యవర్గ బాధ్యులు జడ్పీ సీఈవో పురుషోత్తంను మర్యాదపూర్వకంగా కలిశారు.

# ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 29: తెలంగాణ ప్రభుత్వం అల్ప సంఖ్యాక వర్గాల వారికి విదేశాల్లో చదువు నిమిత్తం సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శ్రీనివాస్‌రావు ఒక ప్రటనలో తెలిపారు. 2024 ఆగస్టు ఒకటి నుంచి 2024 డిసెంబర్ 31 వరకు అడ్మిషన్ తీసుకున్న వారు అర్హులని, విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షలలోపు ఉండాలన్నారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 29: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని గడ్డిగూడెం తండాకు చెందిన బాదావత్ వీరన్న (45) ఇంటి వద్ద వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత స్నానం చేసేందుకు వాటర్ ఈటర్ పెట్టాడు. కొంత సమయం తరువాత ఈటర్ తీస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# కంఠాయపాలెంలో ప్రారంభంకాని కొనుగోలు కేంద్రం

- మెయిల్‌లో కలెక్టర్‌కు యువకుడి ఫిర్యాదు
- కలెక్టర్ ఆదేశాలతో గ్రామంలో అధికారుల విచారణ



యువకుడు శ్రీను కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు

తొర్రూరు, నవంబర్ 29 : వరి కోతలు పూర్తికావొస్తున్నా తొర్రూరు మండలంలోని కంఠాయపాలెంలో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం కాలేదు. దీంతో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులకు అమ్ముకొని మోస పోతున్నారు. రైతుల ఇబ్బందులను గమనించి గ్రామానికి చెందిన మాడగాని శ్రీను అనే యువకుడు గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, మద్దతు ధర, బోనస్ రైతులకు అందేలా చూడాలని మెయిల్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు సమాచారం అందించడంతో ఆర్డీవో, తహసీల్దార్, ఐకేపీ ఏపీఎం, పీఏసీఎస్ సీఈవో గ్రామానికి చేరుకొని కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు పరిశీలించారని శ్రీను తెలిపాడు. గ్రామంలో ఇప్పటికే చాలామంది రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించారనారు. ముందగానే అధికారులు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే మద్దతు ధర, బోనస్‌ను రైతులు కోల్పోయేవారు కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని రైతులను అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.

# నిరుపేద యువతి పెళ్లికి ఆర్థిక సాయం

కేసముద్రం, నవంబర్ 29: కేసముద్రానికి చెందిన నిరుపేద ముస్లిం యువతి రిజ్వాన వివాహానికి వ్యాపారి ఓలం బుచ్చిలింగ-సువర్ణ దంపతులు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు. రిజ్వాన తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నెల 30 ఖమ్మానికి చెందిన నబీసాహెబ్‌తో వివాహం జరగనుండగా, బుచ్చిలింగం దంపతులు ఆర్థికసాయం, పట్టువస్త్రాలు అందజేశారు. ఓలం శ్రీనివాస్-రజిత దంపతులు, బండి సంపత్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

# ధాన్యంలో తరుగు.. ఆర్డీవోకు రైతు ఫిర్యాదు..

పెద్దవంగర, నవంబర్ 29: మండలంలోని సోమ్లాతండాకు చెందిన తేజావత్ యాకన్న ఈనెల 24న ఐకేపీ కొనుగోలు కేంద్రంలో 88.8 క్వింటాళ్ల ధాన్యాన్ని కాంటా వేశాడు. తర్వాత మిల్లుకు తరలించిన నిర్వాహకులు 28న 40 కిలోల తరుగు వచ్చిందని రైతుకు తెలుపడంతో తొర్రూరు ఆర్డీవో గణేశ్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. స్పందించిన ఆర్డీవో సంబంధిత మండల అధికారులకు బాధిత రైతుకు జరిగిన తరుగుపై విచారణ చేపట్టాలని ఆదేశించడంతో అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రానికి చేరుకొని విచారణ చేపట్టారు. 'తరుగు ఎలా జరిగింది.. ఆరా తీసి బాధిత రైతుకు నష్టం జరగకుండా నిర్వాహకులు బాధ్యత వహించాలని' సూచించారు. దీంతో తరుగు ధరను నిర్వాహకులే చెల్లిస్తామని ఒప్పుకున్నారని బాధిత రైతు తెలిపాడు. ఎల్రక్టానిక్ కాంటాల్లో సమస్యల వల్ల తరుగు వచ్చిందని నిర్వాహకులు అధికారులకు తెలిపారు. కాంటాలకు మరమ్మతు చేసిన తర్వాత ధాన్యం కాంటాలు చేయాలని సూచించారు. ఇదిలా ఉంటే మిగతా రైతుల్లో ఎంత తరుగు తీస్తారోనని రైతుల్లో ఆందోళన నెలకొన్నది. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, ఏవో స్వామి, ఏపీఎం రమణాచారి ఉన్నారు.

తరుగుపై విచారణ చేస్తున్న అధికారులు

# ఇబ్బందులు లేకుండా చూడాలి

బయ్యారం, నవంబర్ 29: రైతులకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. శక్రవారం మండలంలోని జగ్గతండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు.ట టార్పాలిన్లు, వాటర్, గన్నీ బ్యాగ్‌లు, ప్యాడీ క్లినర్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ధాన్యం తెచ్చిన వచ్చిన వెంటనే కాంటా వేసి వివరాలను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

మరిపెడ, నవంబర్ 29: కారు బోల్తాపడగా ముగ్గురికి గాయాలైన ఘటన ఆకేరు బ్రిడ్జివద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బ్రిడ్జి వద్ద మరమ్మతు కొనసాగుతున్న ప్రాంతంలో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. మహబూబాబాద్ నుంచి సూర్యాపేట వెళ్తున్న కారు గుంతల వద్ద అదుపు తప్పి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన మామిడి తోటలోకి వెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు తెలియాల్సి ఉన్నది.